## క్లుప్తంగా

### విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరు (టౌన్): బీకాంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఫౌండేషన్ డైరెక్టర్ యమున, డాక్టర్ పెంచలరెడ్డి, ప్రిన్సిపల్ పుల్లయ్య, ప్రియదర్శిని పాల్గొన్నారు.

### ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

నెల్లూరు (టౌన్): సరస్వతీనగర్‌లోని ఐఎంఏ హాల్లో కిశోర్స్ రత్నం విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. శాస్త్రీయ నృత్యాలతో విద్యార్థులు అలరించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, అధినేత కిశోర్, వాసంతి, ఏఓలు తుహీనా, వాణి, సునీల్, ఖాశిం, మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, హెచ్‌ఎం కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

### నియామక ఉత్తర్వుల అందజేత

నెల్లూరు(అర్బన్): కారుణ్య నియామకాల ద్వారా ఇద్దరికి ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులను కలెక్టర్ ఆనంద్ శుక్రవారం జారీ చేశారు. లక్ష్మి మృతి చెందడంతో ఆమె కుమార్తె సునీతకు యానిమల్ హజ్బెండరీ శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా.. వెంకయ్య కుమారుడు కూరపాటి సుబ్రహ్మణ్యానికి జూనియర్ అసిస్టెంట్‌గా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం కల్పించారు. వీటిని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్ అందజేశారు.

### డంపింగ్ యార్డులో పరిశీలన

నెల్లూరు(బారకాసు): అల్లీపురంలోని డంపింగ్ యార్డును మేయర్ స్రవంతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డంపింగ్ యార్డు చుట్టూ ఉన్న ప్రహరీ కొంత మేరకు కూలిందని, నూతనంగా నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. నగరంలో దాదాపు 300 టన్నుల వ్యర్థాలను ఇక్కడికి రోజూ తరలించి ఆపై దొంతాలి యార్డుకు పంపనున్నారని చెప్పారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేస్తున్నామని వివరించారు. డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే సమయంలో కిందపడకుండా వాహనాలపై నెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

### సెంట్రింగ్ మేస్త్రీపై దాడి

నెల్లూరు(క్రైమ్): డబ్బులివ్వలేదంటూ సెంట్రింగ్ మేస్త్రీపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసును వేదాయపాళెం పోలీసులు శుక్రవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చంద్రబాబునగర్‌కు చెందిన సుబ్రహ్మణ్య రమేష్ సెంట్రింగ్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన సోదరులు మణికంఠ, సెల్వ అప్పుడప్పుడూ ఈయన వద్ద పనులకొచ్చేవారు. ఇటీవల రెండు రోజులు వీరి పనిచేయగా, దానికి సంబంధించిన కూలిని మేస్త్రీ ఇచ్చారు. ఈ తరుణంలో సెంట్రింగ్ పనుల విషయమై తన ఇంటి సమీపంలో తెలిసిన వారితో సుబ్రహ్మణ్య రమేష్ గత నెల 25వ తేదీ రాత్రి మాట్లాడుతుండగా, మణికంఠ, సెల్వ అక్కడికొచ్చి డబ్బులు కావాలని కోరారు. లేవని చెప్పడంతో దాడికి పాల్పడ్డారు. గాయపడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### పూటుగా మద్యం సేవించి వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: పూటుగా మద్యం సేవించి నిద్రలోనే వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్లకు చెందిన చేపల రఘురామ్ (39) అమేజింగ్ సొల్యూషన్స్ సంస్థలో ఆర్‌ఎఫ్ఐడీ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కంపెనీ పని నిమిత్తం గత నెల 14న నగరానికి వచ్చిన ఆయన ధనలక్ష్మీపురంలోని ఓ హోటల్‌లో రూమ్‌ను అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఈ తరుణంలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పూటుగా మద్యాన్ని సేవించి తన రూమ్‌లోని కుర్చీలో నిద్రపోయారు. రూమ్‌లో ఉంటున్న భగవాన్ అతడ్ని నిద్రలేపేందుకు తెల్లవారుజామున యత్నించారు. అప్పటికీ స్పందించకపోవడంతో పక్క గదిలోని వారిని పిలిచారు. అప్పటికే రఘురామ్ మృతి చెందారని గుర్తించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఏడు గంటల నుంచే పింఛన్ల పంపిణీ

నెల్లూరు(బారకాసు): సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియను నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి సచివాలయ పరిధిలో శనివారం ఉదయం ఏడు నుంచే ప్రారంభించాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. ఈ మేరకు వార్డు సచివాలయ కార్యదర్శులు, జోనల్ ఇన్‌చార్జిలతో టెలికాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. డప్పు కళాకారుల వివరాలను వెల్ఫేర్ కార్యదర్శులు ప్రత్యేకంగా సేకరించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాలని సూచించారు.

### రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలపై అవగాహన

నెల్లూరు(అర్బన్): నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయ సమావేశ మందిరంలో రెయిన్‌బో స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను శుక్రవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, ఎమ్సీ మెంబర్లు రంగయ్యానాయుడు, గునపాటి ప్రసాద్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సైన్స్ దినోత్సవం

నెల్లూరు (టౌన్): నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సైన్స్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు.

➡ నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

➡ చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు సమీపంలోని మౌంట్ లిటరా స్కూల్లో సైన్స్ ఎక్స్‌పోను నిర్వహించారు. పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కరస్పాండెంట్ ధనరాజ్, కోఆర్డినేటర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ రామలింగాపురంలోని నారాయణ స్కూల్లో ఎడ్యుఫెస్ట్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గర్భకోశ వ్యాధి నిపుణులు నిరుపమ హాజరయ్యారు. డీన్ నరేంద్ర, ప్రిన్సిపల్స్ వెంగళరావు, సోనీ, అకడమిక్ డీన్లు రాఘవేంద్ర, వినీల్, వైస్ ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, ఫాతిమా పాల్గొన్నారు.

➡ వేదాయపాళెంలోని సాయి మహావిద్యాలయంలో సైన్స్ ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిట్లను జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి తిలకించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో..

➡ కొండాయపాళెం దళితవాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

➡ సంతపేటలోని శ్రీచైతన్య స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏజీఎం కొండారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు సతీష్, అకడమిక్ కోఆర్డినేటర్ బాషా, ప్రిన్సిపల్ సురేష్, డీన్ గణేష్ పాల్గొన్నారు.

➡ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, సెకండరీ విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ప్రశంసపత్రాలు, బహుమతులను డీఈఓ బాలాజీరావు, సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు అందజేశారు. సైన్స్‌పై మోటివేషన్ కార్యక్రమాన్ని సైకియాట్రిస్ట్ సురేష్ నిర్వహించారు. సుధాకర్, ఎంఈఓలు అబ్దుల్ హమీద్, మురళీధర్‌రావు, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, శివశంకర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వర పురంలోని శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైన్స్ ఎక్స్‌పోను నిర్వహించారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్‌బాషా, కరస్పాండెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): సైన్స్ ఫలాలు సామాన్యులకు అందినప్పుడే సమాజ పురోగతి సాధ్యమవుతుందని జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయభాస్కర్, కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం, జేవీవీ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. తొలుత జేవీవీ జెండాను ఆవిష్కరించారు. నేతలు డాక్టర్ శ్రీనునాయక్, కృష్ణ, పోతంశెట్టి విద్యాచరణ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మీనాక్షి సుందరేశ్వరుడికి పూజలు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. దేవస్థానంలో కొలువైన మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామికి విశేష పూజలను నిర్వహించారు. పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

## కమనీయం.. రథోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా శుక్రవారం నిర్వహించారు. విశేష పుష్పాలతో తీర్చిదిద్దిన రథంపై కొలువైన భువనేశ్వరీ, మూలస్థానేశ్వరుడ్ని భక్తులు దర్శించుకొని ప్రణమిల్లారు. బ్రహ్మోత్సవాల ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఉభయకర్తలు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత దంపతులు తదితరులు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. మూలాపేటలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి చిరురథం ముందుగా సాగింది. కాగా రథాన్ని తూర్పు వైపునకు మళ్లించి రథోత్సవానికి నిర్వహించేందుకు సుమారు గంటకుపైగా సమయం పట్టింది. దీంతో 10.45 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. నారాయణ విద్యాసంస్థల మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నేతలు చాట్ల నరసింహారావు, నూనె మల్లికార్జునయాదవ్, అజయ్‌రెడ్డి, నానీ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రుణాలతో గ్రామీణాభివృద్ధి

నెల్లూరు(అర్బన్): వ్యవసాయానికి రుణాలను విరివిగా అందిస్తున్న క్రమంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి ముందడుగేస్తోందని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సవరించిన వడ్డీ రాయితీ ద్వారా రుణపరిమితిని కేసీసీ ద్వారా రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచారని వివరించారు. అధిక విలువ కలిగిన ఉద్యాన, వాణిజ్య పంటలు, అనుబంధ కార్యకలాపాల్లో రైతులు పెట్టుబడి పెట్టేందుకు, ప్రోత్సహించేందుకు బడ్జెట్ ఉపకరించిందని వెల్లడించారు.

## వెంచర్ బ్రోచర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బారకాసు): మనుబోలు సమీపంలోని కాగితాలపూరు సెంటర్‌లో బ్లూమ్‌ఫీల్డ్ పేరుతో వర్సుసా లైఫ్ స్పేస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్‌కు సంబంధించిన బ్రోచర్లను రామ్మూర్తినగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్లు శివాజీ, దివ్య మాట్లాడారు. బ్రోచర్‌ను అధికారికంగా సదరు వెంచర్ వద్ద ముఖ్యఅతిథులు ఆవిష్కరించనున్నారని వివరించారు. సంస్థ మార్కెటింగ్ సీజీఎంలు సుధాకర్, అభినవ్‌రాజు, సత్తార్, కాంచన ప్రసాద్, విజయ్‌కుమార్, మార్కెటింగ్ జీఎంలు ఫిరోజ్, జయచంద్ర, వంశీకృష్ణ, వెంకటేశ్వర్లు, రఘుప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

## సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించాలి

నెల్లూరు(బారకాసు): సూర్యఘర్ బిజిలీ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. నగరంలోని 23వ డివిజన్లో గల పడారుపల్లి, చలపతినగర్, సుందరయ్య కాలనీలో పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉపయోగంలో లేకుండా రోడ్డుపై నిలిపి ఉన్న పాత వాహనాలను పోలీసుల సహకారంతో తొలగించాలని ఆదేశించారు. కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్ఓ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఈఈ శేషగిరిరావు, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్, డీఈఈలు ప్రసాద్, ముజాహిద్దీన్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, సర్వేయర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులు

నెల్లూరు రూరల్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులను వేగంగా మంజూరు చేయాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పీఎంఈజీపీ రుణాల మంజూరు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ తదితర అంశాలను జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్ వివరించారు. అనంతరం జేసీ మాట్లాడారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువు కంటే ముందే అనుమతులివ్వాలని సూచించారు. గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నామని తెలిపారు. ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, డిప్యూటీ జోనల్ మేనేజర్ సురేష్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్, ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్, డీటీసీ చందర్ పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

నెల్లూరు రూరల్: రానున్న ఆర్థిక సంవత్సరంలో మంచి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, గిరిజన సంక్షేమాధికారి పరిమళ పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్యపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వివాహిత ఆత్మహత్యపై ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ప్రశాంతినగర్‌లో శివప్రియ (26) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు నెల్లూరు చేరుకున్నారు. ఆస్పత్రిలో విగతజీవిగా పడి ఉన్న కుమార్తెను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. భర్త శేషసాయి ప్రతి చిన్న విషయానికి శివప్రియను బాధపెడుతున్నారని, అతని చర్యలతో మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఆరోపించారు. కుమార్తె మృతికి కారణమైన భర్తపై చర్యలు చేపట్టాలని పోలీసులకు తండ్రి పిచ్చిరెడ్డి ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. శివప్రియ మృతదేహానికి పోస్టుమార్టాన్ని నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 298 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు సిటీ: జిల్లా వ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. కలివెలపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రైతులతో ముఖాముఖి నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. దళారుల బారిన పడి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. సహకార పరపతి సంఘానికి వే బ్రిడ్జి, అదనపు గిడ్డంగిని ఏర్పాటు చేయాలని రైతులు కోరగా, ప్రతిపాదనలను పంపాలని అధికారులకు జేసీ సూచించారు. కాకుపల్లి బిట్ - 1, పెనుబర్తి, మాదరాజుగూడూరు, ఆమంచర్ల, దొంతాలి, గొల్లకందుకూరు, కందమూరు, వెల్లంటి, ములుమూడి, దేవరపాళెం, కొండ్లపూడి, సోమ్మోపూరు, పెద్దచెరుకూరులో కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. డీసీఓ గుర్రప్ప, పౌరసరఫరాల సంస్థ డీఎం అర్జున్‌రావు, డీఎస్ఓ అంకయ్య పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణ శిబిరం

నెల్లూరు (టౌన్): వెంకటాచలంలోని అలెక్సా కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ కోచింగ్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి, డీకేడబ్ల్యూ పీడీ విజయకళ, వెంకటసుబ్బయ్య, ఫౌండేషన్ మేనేజర్ ఆనంద్, కోఆర్డినేటర్ సుమంత్, కోచ్‌లు లత, హరి, మహేష్, రమేష్, మురళి, హరిబాబు పాల్గొన్నారు.

## ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఊరుకునేదిలేదు

నెల్లూరు(అర్బన్): ఏజెన్సీల మోసాలకు అడ్డుకట్ట వేస్తూ గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆప్కాస్ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేస్తే ఊరుకునేదిలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో నగరంలో ప్రదర్శనను మున్సిపల్ కార్మికులు శుక్రవారం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నాను నిర్వహించి, ఏఓ విజయకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ, నేతలు అశోక్, సుజాత, వజ్రమ్మ, భాగ్యమ్మ, కొండమ్మ, శ్రీనివాసులు, బాలు, చెన్నయ్య, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు సిటీ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీదుల వద్ద పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో ముస్లిం పెద్దలు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

# పక్కాగా మోటార్ వాహన చట్టం అమలు

• ఉల్లంఘిస్తే జరిమానాలు, లైసెన్స్‌లు రద్దు

నెల్లూరు(క్రైమ్): రహదారి ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ చట్టాన్ని జిల్లాలో శనివారం నుంచి పటిష్టంగా అమలు చేసేందుకు పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టనుంది. నిబంధనలను ఉల్లంఘిస్తే సవరించిన జరిమానాలు విధించడంతో పాటు పదే పదే ఉల్లంఘనకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్‌లను సైతం రద్దు చేయనున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీసులకు వాహనదారులు సహకరించాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు. ద్విచక్రవాహనచోదకుడితో పాటు వెనుక కూర్చున్న వారూ హెల్మెట్‌ను విధిగా ధరించాల్సి ఉంటుంది. ఇతర వాహనాలు నడిపే వారితో పాటు కో ప్యాసింజర్ సైతం సీటు బెల్టును ధరించాలి. విధి నిర్వహణలో ఉన్న పోలీస్, రవాణా శాఖ అధికారులతో గొడవకు దిగినా, సమాచారమిచ్చేందుకు నిరాకరించినా కేసులు నమోదు చేయనున్నారు.

పెనాల్టీలిలా..

| ఉల్లంఘన | సవరించిన జరిమానా (రూపాయల్లో) |
|---|---|
| హెల్మెట్ లేకపోతే | 1000 |
| వెనుక కూర్చున్న వ్యక్తికి లేకపోతే | 1000 |
| లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే | 5000 |
| ఇన్సురెన్స్ సర్టిఫికెట్ లేకపోతే | 2000 (మొదటిసారి), 4000 (రెండోసారి) |
| పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే | 1500 |
| సెల్‌ఫోన్ డ్రైవింగ్ | 1500 (మొదటిసారి), 10000 (రెండోసారి) |
| నంబర్ ప్లేట్ సక్రమంగా, వాహన పత్రాల్లేకపోయినా | 150 (మొదటిసారి), 300 (రెండోసారి) |
| సీటుబెల్ట్ ధరించకపోతే | 1000 |
| రిజిస్ట్రేషన్ లేకపోయినా, రెన్యువల్ చేయకపోయినా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా | 2000 (మొదటిసారి), 5000 (రెండోసారి) |
| రేసింగ్ | 5000 (మొదటిసారి), 10000 (రెండోసారి) |
| మితిమీరిన వేగం | 1000 |
| ట్రిపుల్ రైడింగ్ | 1000 |

## మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీటీ ఉషాను విజయవాడలో రాష్ట్ర స్క్వే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఇబ్రహీం శుక్రవారం కలిశారు. గోవాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో మొదటిసారిగా రాష్ట్ర జట్టు పాల్గొని మెడల్స్ సాధించడాన్ని వివరించారు.

## రైతులను ఆదుకోవాలని వినతి

నెల్లూరు రూరల్: రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినా, అందులో పరికరాలను విస్మరించారని బీజేపీ నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. రైతులను ఆదుకోవాలని కోరారు. నేతలు నరాల సుబ్బారెడ్డి, కంచర్ల నారాయణయాదవ్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బారకాసు): డిప్యూటీ మేయర్‌గా సయ్యద్ తహసీన్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. అనంతరం ఆమెను సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు. టీడీపీ నేత విజయభాస్కర్‌రెడ్డి, చాట్ల నరసింహారావు, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మైనుద్దీన్, సయ్యద్ సమీర్, ముజీబ్, ఉస్మాన్ పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నెల్లూరు (టౌన్): నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో రావూస్ విద్యాసంస్థల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. విద్యాసంస్థల డైరెక్టర్ శివసంకేత్, సీఈఓ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వస్త్రాల అందజేత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు, పిల్లలకు మిఠాయిలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జయదేవ్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, గణేష్, వెంకట్రావు, గఫార్ పాల్గొన్నారు.

## చర్యలకు కలెక్టర్ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విడవలూరు, మైపాడు బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో వార్డెన్లపై చర్యలకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఈ హాస్టళ్లలో ఇద్దరు వార్డెన్ల అవినీతి ఆరోపణలపై 'వారిపై చర్యలు తీసుకోరా' అనే శీర్షికన సాక్షిలో కథనం గత నెల 23న ప్రచురితమైంది. దీంతో వీరిపై చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ జిల్లా ఆఫీసర్ వెంకటలక్ష్మి మెమోను శుక్రవారం జారీ చేశారు.

## ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పనులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్ పనులను చేపట్టాలని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ ఆదేశించారు. నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాలను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్డును వెడల్పు చేసిన నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాల్సి ఉంటుందని, ఆ సమయంలో వినియోగదారులకు ముందే సమాచారమిచ్చి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. డీఈఈ సునీల్‌కుమార్, ఏఈ కృష్ణవేణి, ఎస్‌ఈ చంద్ర ఆచారి పాల్గొన్నారు.

## ఘనంగా టైలర్స్ డే

నెల్లూరు(బృందావనం): మినీబైపాస్ రోడ్డులోని జీపీఆర్ కల్యాణ మండపంలో టైలర్స్ డేను జిల్లా టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు హాజరయ్యారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా, నగర నూతన కమిటీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మురళీకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, పసుపులేటి యానాదయ్య, జిల్లా, నగర కోశాధికారిగా షేక్ బాబు, నగరాధ్యక్షుడిగా గులామ్ ఖాదర్, గౌరవ సలహాదారులుగా సుందరం, సుబ్రహ్మణ్యం, నగర కమిటీ సభ్యులుగా షేక్ బాబు, సిరాజ్, ఆరిఫ్, చాను, జానీ, ఉదయ్‌కుమార్ ఎన్నికయ్యారు. శ్రీనివాసులు, కమ్రుద్దీన్, కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

నెల్లూరు (పొగతోట): ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు తగ్గకుండా రైస్ మిల్లర్లు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని నెల్లూరు రైస్‌మిల్లర్స్ అండ్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నామని వివరించారు.